
సాక్షి నంద్యాల

గురువారం । 19 । జనవరి । 2023



పార్వతీ సమేత మల్లికార్జునస్వామి వార్లకు పుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ఆదిదంపతుల శయనోత్సవానికి ఏర్పాటు చేసిన ఊయలతల్పం



పుష్పోత్సవానికి సిద్ధం చేసిన ఫలపుష్పాదులు

న్యూస్‌రీల్

గోవిందా..గోవింద

- ఆర్.క్రిష్ణాపురం చేరుకున్న అహోబిలేశుడి పార్వేట



పల్లకీలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం స్వామి ఉత్సవ పల్లకీ మండలంలోని కొండపల్లి గ్రామం నుంచి ఆర్.క్రిష్ణాపురానికి చేరుకుంది. స్థానికులు, అధికారులు స్వామికి ఎదురెళ్లి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. గ్రామంలోని ఆయా తెలుపుల వద్ద కొలువైన స్వామి వద్దకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు కళ్యాణ రంగస్ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

కానిస్టేబుళ్ల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసు కానిస్టేబుళ్ల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. జిల్లా కేంద్రం నంద్యాలలోని తన కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 22న కానిస్టేబుల్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 17,331 మంది అభ్యర్థులకు గాను 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను లోనికి అనుమతించమన్నారు. కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, వాటికి సమీపంలోని జిరాక్స్, బుక్ స్టోర్‌లు మూసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

23న నీతి ఆయోగ్ బృందం రాక

కర్నూలు(హాస్పిటల్): నీతి ఆయోగ్ కేంద్ర బృందం ఈ నెల 23వ తేదీన జిల్లాకు రానుంది. ఈ బృందం జిల్లాలోని హుసేనాపురం, నన్నూరు, కల్లూరు, కలుదేవకుంట్ల, కోసిగి పీహెచ్‌సీలతో పాటు రెండు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించనుంది. ఆయా కేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మందుల గురించి బృందం సభ్యులు సేకరించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



పెద్దయమ్మనూరులో డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో రైతు గాండ్ల సుధాకర్ 0.50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 380 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు వేశారన్నారు. పంట రకం బట్టి మూడు సంవత్సరాల పాటు ఎకరాకు రూ. 1 లక్ష నుంచి రూ. 1.80 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 8 లక్షల జాబ్ కార్డులు ఉండగా ఇప్పటి వరకు 3 లక్షల వ్యవసాయ కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 75 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 56 లక్షలు పూర్తి చేశామన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పీడీ సమావేశమై పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయన సర్వాయిపల్లె జగనన్న కాలనీలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ ఆయన వెంట ఉన్నారు.

అశ్వవాహనంపై ఆదిదంపతులు

- శ్రీశైలంలో కనుల పండువగా పుష్పోత్సవం
- స్వామి అమ్మవార్లకు శయనోత్సవం, ఏకాంతసేవ
- ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో పార్వతీ సమేత మల్లికార్జున స్వామి అశ్వవాహనంపై ఊరేగారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అలంకార మండపంలోకి తీసుకొచ్చి అశ్వవాహనంపై ఆశీనులు చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజాది హారతులిచ్చారు. అనంతరం కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించారు. అశ్వవాహనంపై విహరించిన స్వామి అమ్మవార్లను పలువురు భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

సంప్రదాయబద్ధంగా పుష్పోత్సవం

నూతన వధూవరులైన పార్వతీ మల్లికార్జున స్వామి వార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 రకాల పుష్పాలు, మూడు రకాల పత్రాలతో స్వామిఅమ్మ వార్లకు పూజలు చేశారు. అలాగే అరటి, తెల్లద్రాక్ష, నల్లద్రాక్ష, దానిమ్మ, కమల, యాపిల్, పైనాపిల్, జామ, ఖర్జూరం మొదలైన 9 రకాల ఫలాలు కూడా నివేదించారు. ఏకాంతసేవ, శయనోత్సవ కార్యక్రమాలతో శ్రీగిరిలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పూజా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బనగానపల్లెలో అన్నిహంగులతో సిద్ధమవుతున్న వంద పడకల ఆసుపత్రి

చెంతనే వైద్యం!

బనగానపల్లె, కోవెలకుంట్లలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రులు

- అవుకులో రూ. 2.50 కోట్లతో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ అభివృద్ధి
- శరవేగంగా సాగుతున్న పనులు
- అందుబాటులోకి రానున్న అన్ని రకాల వైద్యసేవలు
- తీరనున్న వ్యయ ప్రయాసలు..లభించనున్న ఆరోగ్య భరోసా

కోవెలకుంట్ల: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోంది. ఇప్పటికే నంద్యాలలో జిల్లాస్థాయి ఆసుపత్రి, 11 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 53 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సేవలందిస్తున్న సర్కారు వాటిని మరింత మెరుగు పరిచి ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బనగానపల్లెలో రూ. 22 కోట్లతో వంద పడకల ఆసుపత్రి, కోవెలకుంట్లలో రూ. 3.80 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తోంది. వీటితో పాటు రూ. 2.50 కోట్లతో అవుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తోంది.

శరవేగంగా పనులు

నియోజకవర్గ కేంద్రమైన బనగానపల్లెలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో గైనిక్, చిన్నపిల్లలు, ఎముకలు, ఈఎన్‌టీ(ముక్కు, చెవి, గొంతు), జనరల్ ఫిజిషియన్, ప్రసవాలు, ఫిజియోథెరపీ, బ్లడ్‌స్టోరేజికి సంబంధించి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాలకు సంబంధించి ఇప్పటి వరకు 15 మంది స్పెషలిస్టు డాక్టర్లను నియమించారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గైనిక్, సర్జన్, చిన్నపిల్లల విభాగం, ఎంసీహెచ్, ఓటీ, అత్యవసర విభాగాలు, ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వసతులు అందుబాటులోకి రానున్నాయి. 30 పడకల ఆసుపత్రిలో ఎనిమిది మంది డాక్టర్లు, తొమ్మిదిమంది స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్లతో కలిపి 31 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇప్పటి వరకు 28మందిని నియమించారు. ఇప్పటి వరకు సీహెచ్‌సీలో ప్రసవాలు, చిన్న చిన్న ఆపరేషన్లు, ట్యూబెక్టమీ ఆపరేషన్లు కొనసాగుతుండగా 30 పడకల ఆసుపత్రిలో ఈ సేవలు మరింత విస్తృతం కావడంతోపాటు మత్తుమందు ఇచ్చి చేసే ఆపరేషన్లు అందుబాటులోకి రానున్నాయి. మండల కేంద్రమైన అవుకులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. పాత సీహెచ్‌సీ భవనం నుంచి కొత్తగా కనెక్టివిటీ హాలు, అడ్మిషన్ గది, రోగుల వివరాల నమోదుకు ప్రత్యేక కౌంటర్, మార్చురీ, రోగులు వేచి ఉండేందుకు ప్రత్యేక గది, పాత సీహెచ్‌సీ భవన మరమ్మతులు, తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఈ సదుపాయాలన్నీ అందుబాటులోకి వస్తే రోగులకు అన్ని రకాల సేవలు అందుతాయి.



రూ. 2.50 కోట్లతో ఆధునీకీకరిస్తున్న అవుకు సీహెచ్‌సీ

డిజిటల్ వైద్య సేవలకు కసరత్తు

జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో ఇకపై రోగులకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) సేవలు అందనున్నాయి. రోగి ఓపీ తీసుకున్నప్పటి నుంచి పరీక్షలు, ఫలితాలు, మందుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచేలా కసరత్తు జరుగుతోంది. అందుకనుగుణంగా ఆయా ఆసుపత్రుల్లో రోగుల ఐడీ వివరాలను నమోదు చేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు వివిధ రోగాల నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ముందుగా ఓపీ చీటి రాసిచ్చేవారు. మందులు, ఇతర వివరాలు సైతం పేపర్‌పై రాసి అందించేవారు. రోగి మళ్లీ ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆ చీటీని తీసుకొస్తేనే సక్రమంగా వైద్యం అందేది. ఒకవేళ చీటి పోగొట్టుకుంటే చికిత్స మళ్లీ మొదటికొచ్చేది. దీంతో ఒక్కోసారి వైద్యసేవలందటంలో ఆలస్యమై రోగి ప్రాణం మీదకు వచ్చేది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ ఆసుపత్రి విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రోగి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేస్తారు. గతంలో ఉన్న హెల్త్ సమస్యలు, ప్రస్తుతం అందించే చికిత్స, పరీక్షల వివరాలు పొందుపరిచి మందులు ఇస్తారు . రోగి తిరిగి ఆసుపత్రికి వెళ్లే సమయంలో ఆధార్, ఐడీ నెంబర్ తీసుకెళితే ఒక క్లిక్‌తో రోగికి అప్పటి వరకు అందుతున్న వైద్య సేవలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఆ వివరాల ఆధారంగా తదుపరి వైద్యం అందుతుంది.

వైద్య కష్టాలకు చెక్



కోవెలకుంట్లలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి

బనగానపల్లె, కోవెలకుంట్ల వాసులు గతంలో ఏ చిన్న రోగమొచ్చినా నంద్యాల, కర్నూలు, జమ్మలమడుగు, తదితర పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. గుండె, మెదడు, కిడ్నీ, తదతర వైద్య సేవలకు హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళాల్సి వచ్చేది. బనగానపల్లెలో వంద పడకలు, కోవెలకుంట్లలో 30 పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే శాశ్వతంగా ఆ కష్టాలకు చెక్ పడనుంది. దీనికి తోడు స్థానికంగానే బ్లడ్‌బ్యాంకులను ఏర్పాటు చేయనుండటంతో రోగులకు రక్తం కొరత లేకుండా ఉంటుంది. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో బ్లెడ్‌స్టోరేజిబ్యాంకు లేకపోవడంతో రక్తహీనతతో బాధపడే రోగులు, ప్రమాద క్షతగాత్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు రక్తం అవసరమైతే నంద్యాల, కర్నూలుకు వెళ్లి రక్తం ఎక్కించుకుంటున్నారు. ఇప్పుడు ఆసుపత్రుల్లో బ్లడ్ స్టోరేజీ బ్యాంకులు ఏర్పాటవుతుండటంతో ఇక తమకు వ్యయప్రయాసలు ఉండవని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరిపోతాయి



బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణాల్లో నూతన ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే వైద్య కష్టాలు తీరిపోయినట్లే. పెద్ద పెద్ద వైద్యానికి సంబంధించి సుదూర ప్రాంతాలకు పోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉచితంగా వైద్యసేవలు అందుతాయి. వివిధ రకాల ఆపరేషన్లు ఇక్కడే చేసేలా వసతులు కల్పిస్తుండటంతో మంచి వైద్యం అందుతుంది. ఇదివరకులాగా వ్యయ, ప్రయాసలు ఉండవు.

– గుర్రప్ప, కోవెలకుంట్ల

రోగులకు అత్యంత చేరువలో వైద్యం



కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇప్పటి వరకు వివిధ రకాల వైద్య సేవలందిస్తున్నాము. 30 పడకల ఆసుపత్రికి సంబంధించి ప్రభుత్వం డాక్టర్లు, వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించింది. ఆసుపత్రి ప్రారంభమైతే ఐదు, ఆరు మండలాల ప్రజలకు అత్యంత చేరువలో వైద్య సేవలు అందుతాయి. ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానుండటంతో ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్‌ల సంఖ్య పెరుగుతుంది.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్, కోవెలకుంట్ల

పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే కరెంట్ కట్

నంద్యాల(రూరల్): పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించని గృహాలకు ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడీఏలు, మండల విద్యుత్ అధికారులు తమ పరిధిలోని పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. చెల్లించని వినియోగదారుల ఇళ్లకు కరెంట్ కట్ చేయాలన్నారు.

4 నుంచి వాయుసేనలో ఉద్యోగాల ఎంపిక

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో గ్రూప్ వై మెడికల్ అసిస్టెంట్ (పురుషులు) ఉద్యోగాల ఎంపిక కార్యక్రమం వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు చెన్నైలో నిర్వహిస్తారని జిల్లా యువజన సంక్షేమాధికారి పీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ముందుగా రాతపరీక్ష ఉంటుందని, ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆరోగ్య శారీరక దారుఢ్యపరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు భారత వాయుసేన వెబ్‌సైట్ www.airmenselection.cdac.in, 9345377868ను సందర్శించాలన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.14 లక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): సంక్రాంతి పండుగ ఆర్టీసీకి మంచి ఆదాయాన్ని తెచ్చి పెట్టింది. వారం రోజులుగా వివిధ దూర ప్రాంతాలకు నడిపిన బస్సు సర్వీసుల ద్వారా రూ.14.32 లక్షల ఆదాయం వచ్చింది. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, విజయవాడకు మొత్తం 61 బస్సు సర్వీసులు నడపగా 6,054 మంది ప్రయాణించినట్లు రీజినల్ మేనేజరు వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్ పర్యటనను విజయవంతం చేద్దాం



గిరిజన గురుకుల పాఠశాల వద్ద ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

పాణ్యం: రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ పర్యటనను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. నెరవాడ మెట్ట సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ తొలుత గిరిజనులకు సంబంధించిన వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి వారితో మాట్లాడతారన్నారు. అనంతరం లబ్ధిదారులకు డీఆర్‌డీఏ ద్వారా పొట్టేళ్లు, కుట్టు మిషన్ల పంపిణీ చేస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, డీటీడబ్ల్యూఓ ఉశేనయ్య, పీఆర్ ఎస్‌ఈ రామ్మోహన్, డీఈఓ అనురాధ, అగ్నిమాపక సిబ్బంది, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, సీఐ వెంకటేశ్వరరావు, డీటీడీఏ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యటన షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర గవర్నర్ ఈ నెల 20వ తేదీ ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.40 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

- అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా పాణ్యం మండలం నెరవాడ మిట్ట వద్ద ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు 11:20 గంటలకు
- 11:30 నుంచి 12:55 గంటల వరకు గిరిజనులతో ముఖాముఖి
- 1:15 నుంచి 2 గంటల వరకు నంద్యాల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో భోజనం
- 2.40 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరుకు బయలుదేరుతారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎన్నికల హామీలను 95శాతం పైగా నెరవేర్చిన ప్రభుత్వం మనదే
- జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా



జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని నూనెపల్లెలోని ఎంపీ పోచా కార్యాలయంలో సచివాలయ జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రీజినల్ కో ఆర్డినేటర్లు రామసుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల (జేసీఎస్) ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, కాటసాని రామిరెడ్డి, తొగురు ఆర్థర్, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మూడున్నర సంవత్సరాల కాలంలో 95 శాతం పైగా నెరవేర్చిన ముఖ్యమంత్రి దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. రూపాయి కూడా అవినీతి లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా అర్హుల ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్లు మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామన్నారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అయితే, దీనిని ఓర్వలేక కొందరు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. రానున్నది ఎన్నికల సమయమని ప్రతి ఒక్కరూ అలర్ట్‌గా ఉండి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ప్రచారం ఉధృతం చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు కలిసికట్టుగా రావడానికి ప్రయత్నిస్తున్నాయని, రాజు బలంగా ఉన్నప్పుడే శత్రువులు అంతా ఏకం అవుతారన్నారు. అయితే, ఎంత మంది కలిసి వచ్చినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాలు గెలిచి తీరుతుందన్నారు.జేసీఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రతి పక్ష పార్టీల అసత్య ప్రచారానికి ఎల్లో మీడియ వంత పాడుతుందన్నారు. వారి దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యత జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులపై ఉందన్నారు.

క్లుప్తంగా

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం



కోల్డ్ స్టోరేజీ మోటార్‌ను స్విచ్ ఆన్ చేస్తున్న కాటసాని రామిరెడ్డి

నంద్యాల(అర్బన్): పాడిరైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని నంద్యాల, పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి అన్నారు. విజయ డెయిరీలో దాదాపు రూ.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఫిల్లింగ్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్‌లను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. 70 వేల లీటర్లు ఉన్న ప్రొక్యూర్‌మెంట్‌ను కొత్త మిషనరీల ద్వారా లక్ష లీటర్లకు పెంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం విజయ డెయిరీ లాభాల బాటలో పయనిస్తూ ఇతర డెయిరీలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గడిచిన ఈ రెండేళ్లలో డెయిరీకి వచ్చిన ఆదాయంలో రూ.10 కోట్లు రైతులకు బోనస్‌గా ఇవ్వడం హర్షనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్మోహన్‌రెడ్డి అభినందనీయుడని చెప్పారు. కార్యక్రమంలో డెయిరీ డీఎం పరమేశ్వరరెడ్డి, ఏడీఎం రాజేష్, జెడ్పీటీసీ సభ్యులు గోకుల్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో 25న టెంకాయల వేలం

బండిఆత్మకూరు : ఓంకార క్షేత్రంలో ఈ నెల 25వ తేదీన టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాచి వేలంలో పాల్గొనాలన్నారు. ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం పాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

లంపీస్కిన్ లక్షణాలతో రెండు ఎద్దులు మృతి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో లంపీస్కిన్ లక్షణాలతో రెండు ఎద్దులు మృతి చెందాయి. బాధితుడు సాంబశివుడు తెలిపిన వివరాల మేరకు.. తనకు ఐదు ఎద్దులు ఉండగా అందులో రెండు ఎద్దులు జ్వరంతో సక్రమంగా మేత మేయకపోవటంతో పశువుల వైద్యశాలకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడి వైద్యులు తన ఎద్దులకు సరైన చికిత్సలు అందించకపోవటంతో అవి మృత్యువాతపడినట్లు వాపోయాడు. మంగళవారం రాత్రి ఓ ఎద్దు, బుధవారం ఉదయం మరో ఎద్దు మృతిచెందినట్లు తెలిపారు. దీంతో తనకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ఎద్దులు మృత్యువాతపడకముందే పశు వైద్యులు మెరుగైన చికిత్స అందించి ఆదుకోవాలని కోరారు.

పైసా పెంచకుండా ప్రతిపాదన

2023–24 సంవత్సరానికి విద్యుత్ కొత్త టారీఫ్
- లోటు పేరుతో ఏపీ ఈఆర్‌సీకి డిస్కంల ప్రతిపాదనలు
- చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో 16 లక్షల మంది వినియోగదారులకు ఊరట
- నేటి నుంచి ఏపీ ఈఆర్‌సీ బహిరంగ విచారణ



కర్నూలు(రాజ్‌విహార్): బిల్లు ఎక్కువగా వచ్చింది.. విద్యుత్ చార్జీలు అధికంగా ఉన్నాయని జనం అనుకుంటుంటే.. ఇప్పటికే అధిక ధరకు యూనిట్‌ను కొనుగోలు చేసి తక్కువ ధరకే సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన సబ్సిడీ ప్రభుత్వం భరిస్తున్నా విద్యుత్ పంపిణీ సంస్థలు మాత్రం నష్టాల్లో ఉన్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయి. లోటు పూడ్చుకునేందుకు విద్యుత్ చార్జీలు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని విన్నవించాయి. అయితే, సామాన్య ప్రజలు, వాణిజ్య వ్యాపారవేత్తలపై భారం పడకుండా లోటు భరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు పైసా పెంచకుండా ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యూలేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) గురువారం నుంచి మూడు రోజుల పాటు విచారణ చేపట్టనుంది. విద్యుత్‌పై సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారీఫ్, కాస్ట్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై వినియోగదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి సూచనలు, అభ్యంతరాలు, సలహాలు సేకరించనున్నారు.

యూనిట్ ధర రూ.7.94.. ఇస్తోంది రూ.4.50కి

విద్యుత్ పంపిణీ సంస్థలు యూనిట్‌ను రూ.4.59కు కొనుగోలు చేస్తున్నాయి. దీనికి ట్రాన్స్‌మిషన్, సరఫరా, నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు కలిపి ఒక యూనిట్ రూ.7.94 (యావరేజ్‌గా) అవుతోంది. అయితే గృహ వినియోగదారులకు తక్కువ ధరకే సరఫరా చేస్తున్నారు. గృహ వినియోగదారుల్లో మినిమమ్ 30 యూనిట్లలోపు వాడితే రూ.1.90, 125 యూనిట్లులోపు వాడితే రూ.4.50 చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా సాధారణ వినియోగదారులంతా ఈ కేటగిరీల్లోపే ఉన్నారు.

లోటు కారణంగా డిస్కంల ప్రతిపాదనలు..

విద్యుత్ కొనుగోళ్లు, పంపిణీ, లైన్‌లాస్, నిర్వహణ కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో ఉన్నట్లు పేర్కొంటున్నాయి. లోటు పూడ్చుకునేందుకు విద్యుత్ చార్జీలు పెంచాల్సి వస్తోందని, దీనికి అనుమతి ఇవ్వాలని కోరుతూ డిస్కంలు ఏపీ ఈఆర్‌సీకి విన్నపాలు చేశాయి. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.6,546 కోట్లు నష్టాల్లో ఉన్నట్లు సమగ్ర నివేదికలు సమర్పించాయి. అయితే చార్జీలు పెంచేందుకు నిరాకరించిన ప్రభుత్వం ఆ లోటును తీర్చేందుకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 16 లక్షల మంది వినియోగదారులకు ఊరట లభించనుంది.

సూచనలు, సలహాలు ఇవ్వండి



2023–24 సంవత్సరానికి విద్యుత్ కొత్త టారీఫ్‌పై గురువారం నుంచి ఏపీ ఈఆర్‌సీ విచారణ చేపడుతోంది. ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో రిజిష్టర్ చేసుకున్న వారు 19, 20, 21తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు కర్నూలు విద్యుత్ భవన్, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేశాం. – ఎం.ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ, కర్నూలు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

- ఫెన్సింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. స్థానిక పద్మావతి నగర్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సీఈఓ ఎంవీ రమణ, కర్నూలు జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అండర్–19 బాల బాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుందన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో నంద్యాలను క్రీడా హబ్‌గా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫెన్సింగ్ క్రీడా పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి దాదాపుగా 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఔెన్స సంఘ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎస్జీఎఫ్ కార్య నిర్వహణ సభ్యులు, కోచ్‌లు ఏపీరెడ్డి, నాగరాజు, రాఘవయ్య, రామకృష్ణారెడ్డి, రామణారెడ్డి, భయ్యారెడ్డి, చలపతి, మహేశ్వరరావు, లక్ష్మీనారాయణ, రవీంద్రనాథ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పగిద్యాల: జీవితంపై విరక్తిచెందిన ఓవ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం మండల కేంద్రమైన పగిద్యాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలస్వామి రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(లీగల్): విశ్వ ఆయుర్వేద పరిషత్, ఆయుష్ విభాగాల సహకారంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సి.లక్ష్మణరెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. వైద్యశిబిరంలో వైద్యనిపుణులు డాక్టర్ డీఏ పద్మనాభరెడ్డి, డాక్టర్ మాధవరావు చౌదరి, డాక్టర్ వీకేఎం లావణ్య సేవలు అందిస్తారన్నారు. న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ

- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి
- జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

బొమ్మలసత్రం: రోడ్డు భద్రతా నియమాలపై అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వైఎస్సార్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్టీవో కార్యాలయ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిషోర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ హాజరయ్యారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 24 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. డ్రైవింగ్ పట్ల సరైన అవగాహన లేక యువకులు అధికంగా ప్రమాదాల బారినపడుతున్నారని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్ , ట్రిపుల్ రైడింగ్ అందుకు ప్రధాన కారణమన్నారు. కొందరు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, డివైడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీకాంత్, ట్రాఫిక్ సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ నజీర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో గుండెశస్త్రచికిత్సలు పునఃప్రారంభం



ఆపరేషన్ చేయించుకున్న ఈరన్నతో సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుండెశస్త్రచికిత్సలు పునఃప్రారంభమయ్యాయి. ఆరు నెలలు క్రితం మత్తు మందు ఇచ్చే డాక్టర్ బదిలీ కావడంతో గుండెశస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆయన తిరిగి కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు గత వారం నుంచి గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు మొదలయ్యాయి. ఈ నెల 11న నందవరానికి చెందిన ఈరన్న(46)కు ఆపరేషన్ నిర్వహించారు. ఈయనకు గతంలో స్టెంట్ వేయగా మళ్లీ బ్లాక్ ఏర్పడడంతో ఆసుపత్రిలో చేరారు. అతనికి బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించారు. ఆయనతో పాటు కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన పెద్ద మాదన్న(74)కు మంగళవారం ఆపరేషన్ చేశారు. ఈయనకు హార్ట్‌లో వాల్వ్‌లు బ్లాక్ కావడంతో బీటింగ్ హార్ట్ బైపాస్‌సర్జరీ చేశారు. ఈ రెండు శస్త్రచికిత్సలతో కలిపి ఇప్పటి వరకు ఈ విభాగంలో గుండె శస్త్రచికిత్సల సంఖ్య 505కు చేరుకున్నట్లు హెచ్‌వోడీ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం తనతో పాటు అనెస్తెటిస్ట్ ఉండటం, కొత్తగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిక్రిష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, డాక్టర్ బెనెడిక్టా, పర్ఫ్యూజనిస్టు, అవసరమైన నర్సింగ్ సిబ్బంది ఉండటంతో ఇకపై నిరంతరాయంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఎంతో క్లిష్టమైన కేసులకు కూడా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇక్కడ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి



రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన దస్తగిరి రెడ్డిని అభినందిస్తున్న ఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కర్నూలు కల్చరల్: ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలోని ఎన్జీవో హోంలో నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావ దంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి, జవహర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యుల సహకారంతో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న దస్తగిరిరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది రెండోసారి. తనకు సహకరించిన జిల్లా నేతలకు దస్తగిరిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

- ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి



పాలకమండలి సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓ, సభ్యులు

మహానంది: మహానంది క్షేత్రంలో వచ్చే నెలలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మాపాల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చైర్మన్ కార్యాలయంలో 12వ పాలకమండలి సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగ్గా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని రాష్ట్రస్థాయి చెక్కభజన పోటీలు ఏర్పాటు చేస్తామని, కేరళ కళాకారుల చేత వాయిద్యం ఉంటుందన్నారు. ఈ నెల 24న నంద్యాలలోని ఆర్డీఓ కార్యాలయంలో మొదటి కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మహానందీశ్వరుడి భక్తులకు ఉచితంగా విభూది

మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే ప్రతి భక్తుడికి ఉచితంగా మహానందీశ్వరుడి విభూది ప్రసా దం ఇచ్చేందుకు తీర్మానం చేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.సమష్టి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. గతేడాది ఉత్సవాల్లో 1.20లక్షల లడ్డూలు విక్రయించామని, ఈ ఏడాది అదనంగా 1.40లక్షల లడ్డూలు సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. ఉదయాస్తమాన, ప్రదోషకాల సేవల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు పూజల్లో దాతలు పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అందులో భాగంగా దాతలు ఒక్కొక్కరు రూ. లక్ష చెల్లిస్తే 15 ఏళ్ల పాటు ఏడాదికి ఒకసారి పూజల్లో పాల్గొనవచ్చన్నారు. రాతి నంది సర్కిల్ వద్ద నూతనంగా రహదారి నిర్మాణానికి తీర్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు బసిరెడ్డిగారి రామతులశమ్మ, గజ్జా సంపూర్ణ, తపిల లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, హేమలత, పార్వతమ్మ, గంగిశెట్టి మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

దిమ్మె మీద పడి వ్యక్తి మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు పెద్దాసుపత్రిలో సిమెంట్ దిమ్మె మీద పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఆసుపత్రిలో డ్రగ్‌స్టోర్ సమీపంలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను ట్రామాకేర్ పక్కకు మార్చుతున్నారు. ఆ పనిని నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన కంబన్న(50)తో పలువురు కూలీలు చేస్తున్నారు. కాగా బుధవారం ఆయన కిటికీలు, రేకులు తొలగించేందుకు ప్రయత్నించే క్రమంలో కిటికీ పైనున్న సిమెంట్ దిమ్మె కంబన్నపై పడింది. కొద్దిసేపటి తర్వాత జేసీబీ ద్వారా దిమ్మెను తొలగించారు. గాయపడిన అతడిని క్యాజువాలిటీకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు నిర్ధారించారు. పనుల సమయంలో ఇంజినీరింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళం



విరాళ బాండును దాతలకు అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన జి.భవానీప్రసాద్ రూ.1,00,000 విరాళంగా అందజేశారు. దాతలకు విరాళ కేంద్రం అధికారులు బాండు, స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందించి సత్కరించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన రైతు కోలంట్ల లక్ష్మీనారాయణ (53) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఐదేళ్లుగా పంటల సాగులో నష్టాలు వస్తుండటంతో రెండేళ్ల క్రితం మూడెకరాల తోట విక్రయించి అప్పులు చెల్లించాడు. మరో మూడు ఎకరాల్లో పత్తి సాగు చేసినా కలిసి రాకపోవడంతో దాదాపు రూ. 10 లక్షలు అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల క్రితం ఇతని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మద్దికెర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు

కొత్తపల్లి: కృష్ణానది పరివాహక ప్రాంతం వెంట, నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోని గ్రామాల ప్రజలు పెద్దపులి సంచారంపై ఆందోళన చెందొద్దని ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని జనాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల సమీపంలో పెద్దపులి జాడ కోసం గాలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల సమీప ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని ప్రజలు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి ఆదేశాల మేరకు పులిజాడ కోసం తనిఖీ చేశామన్నారు. కెమెరా ట్యాబ్‌లు కూడా ఏర్పాటు చేశామని, పులి తిరగాడిన జాడ ఎక్కడా కనబడలేదని తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్కడక్కడా ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నామన్నారు.

9 మంది పోలీసులకు అవార్డు

కర్నూలు(టౌన్): గత ఏడాది డిసెంబర్ నెలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మంది పోలీసులకు వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు ప్రకటించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంచి ప్రతిభ కనపరచిన తొమ్మిది మంది పోలీసులకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రశంసాపత్రాలు అందజేశారు. 147 ఎక్సైజ్ కేసుల్లో చార్జిషీట్లు తీసుకుని కోర్టులో ఫైల్ చేసిన కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చెందిన జి.వెంకటేష్, రెండు చోరీ కేసుల్లో నిందితులను గుర్తించి రూ.1.73 లక్షలు రికవరీ చేసిన చిప్పగిరి కానిస్టేబుల్ చెందిన టి.చంద్రన్న, కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసుల్లో నిందితులను గుర్తించి చోరీ సొత్తు రూ.4.15 లక్షలు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన కానిస్టేబుల్ ఆర్.కిషోర్, బాలాజీ నగర్ దగ్గర ఏటీఎం అపహరణకు యత్నించిన నిందితులను వెంబడించి వారికి సంబంధించిన కంటైనర్‌ను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనపరచిన కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు వి.రవి, పత్తికొండ అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రూ.2 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేసిన కానిస్టేబుల్ ఎం.సుశీల్‌కుమార్, హోంగార్డ్ అన్వర్ బాషా(హెచ్‌జీ53), రూ.4.10 లక్షల చోరీ కేసును 24 గంటల్లో ఛేదించి నగదు రికవరీ చేసిన సి.బెళగల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బి.రమేష్, చోరీ కేసులో ఇతర రాష్ట్రాలకు వెళ్లి రూ.9.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను రికవరీ చేసిన ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన డి.శేఖర్‌బాబు, హోంగార్డ్ ముస్తాక్‌కు వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులను ఎస్పీ అందజేసి వారిని అభినందించారు.